ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి


పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 196

సోమవారం 20 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD


## యాదగిరిగుట్టలో భక్తుల కిట...కిట!!

ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం





## ట్రంప్ వచ్చేస్తున్నాడు!

భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి 10.30కి ప్రమాణం
వాషింగ్టన్‌లో తీవ్ర చలి.. బహిరంగ ప్రదేశంలో నిర్వహించొద్దని నిర్ణయం
కేపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో ప్రమాణ స్వీకారం
హాజరుకానున్న మస్క్, బెజోస్, జుకర్‌బర్గ్

05



## ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ అవకాశం

కొత్త రేషన్ కార్డులు, మార్పులు చేర్పులకు కూడా..
గతంలో దరఖాస్తు చేసుకోని వారికి మరో చాన్స్
రేపటి నుంచి 24 వరకు గ్రామ సభల్లో స్వీకరణ

05



# డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందే

ఆర్థిక వ్యవస్థ గాడిన పడాలంటే అదొక్కటే మార్గం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నాయి
6 గ్యారెంటీలు అమలయ్యాకే రాహుల్ రాష్ట్రానికి రావాలి
బీజేపీతోనే తెలంగాణలో ప్రజా పాలన సాధ్యం: కిషన్‌రెడ్డి



**రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిన పడాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని ఆరోపించారు.**

హైదరాబాద్/సిటీ, రోమింగ్‌న్యూస్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ఉద్యమకారులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం పదేళ్లుగా నీతి, నిజాయితీ, జవాబుదారీతనంతో పనిచేస్తోందని వివరించారు. మోదీ దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ గాడిలో పెట్టారని.. తెలంగాణలో కూడా ఆర్థిక వ్యవస్థ

మిగతా 2 లో

# ముగిసిన సీఎం సింగపూర్ పర్యటన

రూ.450 కోట్లతో హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్కు నిర్మాణానికి అంగీకారం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో సింగపూర్ కంపెనీ క్యాపిటల్ ల్యాండ్ ప్రకటన
ఈ సంస్థకు హైదరాబాద్‌లో ఇప్పటికే 3 యూనిట్లు
రాష్ట్రానికి రూ.3,950 కోట్ల పెట్టుబడులు
నేడు స్విట్జర్లాండ్‌లోని దావోసకు రేవంత్ బృందం
సదస్సుకు ఐదుగురు కేంద్ర మంత్రులు, ముగ్గురు సీఎంలు, 100కు పైగా సీఈవోలు

హైదరాబాద్,రోమింగ్ న్యూస్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో

మిగతా 2 లో

## రైతుల చావులు సీఎంకు కనిపించడం లేదా?

అన్నదాతల మరణాలు ప్రభుత్వ హత్యలే..

భరోసా ఇవ్వడంలో సర్కారు విఫలం
బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
ఆదిలాబాద్‌లో 24 గంటల్లో ఇద్దరు అన్నదాతల మృతిపై ఆవేదన
రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాకు డిమాండ్



.. వివరాలు 2లో

## అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డు

గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక: భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం, రోమింగ్‌న్యూస్: అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో సోమవారం (20వ తేదీ) నుంచి గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడి

మిగతా 2 లో



### కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు ఇస్తాం

పాత కార్డులను తొలగించం..బీఆర్ఎస్ ప్రచారాలు నమ్మొద్దు
పదేళ్లలో ఆ పార్టీ ఇచ్చింది 40 వేల కార్డులే: మంత్రి ఉత్తమ్

02



## చంద్రబాబుకు మోదీ కొండంత అండ

ఆ విధ్వంసం మర్చిపోండి
మూడింతల అభివృద్ధి సాధిస్తాం
6 నెలల్లోనే ఏపీకి 3 లక్షల కోట్లు
ఎన్డీఆర్ఎఫ్ వేడుకల్లో అమిత్ షా

.. వివరాలు 5లో



## సైఫ్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడు!

థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అరెస్టు, కోర్టులో హాజరు
ఐదు రోజుల పోలీసు కస్టడీకి న్యాయస్థానం అనుమతి

05



## మహా కుంభమేళాలో సిలిండర్ పేలుడు

పెద్ద ఎత్తున మంటలు.. 18 టెంట్లు దగ్ధం

ప్రయాగ్‌రాజ్ రోమింగ్‌న్యూస్: మహా కుంభమేళాలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో కుంభమేళా సెక్టార్-19లోని గీతా ప్రెస్ వద్ద 18 టెంట్లు పూర్తిగా కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ అలుముకోవడంతో భక్తు లు భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో భక్తులెవరూ గాయపడలేదు. వెంటనే స్పందించిన

మిగతా 2 లో



## ఊళ్ల నుంచి హైదరాబాద్ బాట

65వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
ఆదివారం 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు

.. వివరాలు 2లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
20 జనవరి
2025





# ముగిసిన సీఎం సింగపూర్ పర్యటన

మొదటి పేజీ తరువాయి

ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. బ్లూచిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలు ఈ ఐటీ పార్కులో ఉ ండనున్నాయి. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ.. హైదరాబాద్‌లో తమ పెట్టుబడుల నిర్ణయాన్ని ప్రకటించింది.

సింగపూర్ కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ.. ప్రపంచస్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటిగా ఉంది. కాగా, క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించడంతోపాటు ఈ కంపెనీ చేపట్టే కొత్త ఐటీ పార్కు నిర్మాణం హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. కంపెనీ ప్రతినిధి గౌరీశంకర్ నాగభూషణం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించడం సంతోషంగా ఉందని తెలిపారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్‌పార్కు (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్ పెరల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తికానుందని సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

సింగపూర్ పర్యటనలో భాగంగా మూడోరోజు సీఎం రేవంత్‌రెడ్డి బృందం.. అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) ప్రతినిధులతో ముఖాముఖి సంభాషణలు, చర్చలు జరిపింది. ఇండియన్ ఓసియన్ గ్రూప్ ఫౌండర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ప్రదీప్తో బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్‌హిమ్ చౌన్, డీబీఎస్ గ్రూప్ హెడ్ అమిత్‌శర్మ, బ్లాక్‌స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండీ, చైర్మన్ గౌతమ్ బెనర్జీ, బ్లాక్‌స్టోన్ రియల్ ఎస్టేట్ సీనియర్ ఎండీ పెంగ్‌వీ టాన్, మెయిన్ హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షాజాద్‌తో రేవంత్‌రెడ్డి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను సీఎం రేవంత్ వారికి వివరించారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. దీంతో.. రాష్ట్రానికి పెట్టుబడులు, కంపెనీలను తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారులతో కూడిన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం చేపట్టిన మూడు



రోజుల పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆదివారం రాత్రి ఈ బృందం స్విట్జర్లాండ్‌లోని దావోసకు బయలుదేరింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.

## సింగపూర్ నుంచి రూ.3950 కోట్ల పెట్టుబడులు..

సింగపూర్ నుంచి తెలంగాణకు దాదాపు రూ.3,950 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సింగపూర్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈ మేరకు పెట్టుబడులు సాధించింది. పెట్టుబడులు, ఒప్పందాలతోపాటు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)తో స్కిల్స్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం కీలక పరిణామం. కాగా, హైదరాబాద్‌లో రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. ఇందుకోసం రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

# అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డు

మొదటి పేజీ తరువాయి

ఇంటికి అధికారులే వచ్చి సంక్షేమ పథకాలను అందజేస్తారని, ఈ నెల 26 నుంచి సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ద్వారా రెండు దఫాలుగా రూ.12వేలు, రైతుభరోసా కింద సాగు యోగ్యమైన భూములకు రూ.15 వేలు అందిస్తామన్నారు.



## కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు ఇస్తాం

### పాత కార్డులను తొలగించం..బీఆర్ఎస్ ప్రచారాలు నమ్మొద్దు

### పదేళ్లలో ఆ పార్టీ ఇచ్చింది 40 వేల కార్డులే: మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేయనుందని, దీంతో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పాత కార్డులను రద్దు చేసే ప్రసక్తే లేదని, అవసరమైతే కుటుంబ సభ్యుల పేర్లు చేరుస్తామని చెప్పారు. ఈ నెల 26న ప్రారంభించే కొత్త కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని హౌసింగ్ మోడల్ కాలనీ పనులను ఆయన పరిశీలించారు. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద ఎత్తిపోతల పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ కార్డుకు అర్హత ఉండి రాని చివరి వ్యక్తి నుంచి కూడా దరఖాస్తు స్వీకరించి, కార్డు అందించేలా సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులందరం నిరంతరం పనిచేస్తున్నామన్నారు. రేషన్ కార్డులు లేనివారు, దరఖాస్తు చేయనివారు, అర్హత ఉన్న ప్రతిఒక్కరూ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దేశ చరిత్రలో నిలిచిపోయేలా రేషన్ కార్డులు మంజూరు చేయబోతున్నా మని, ఈ నెల 26న ఆరంభం మాత్రమేనని, అంతం కాదన్నారు. రేషన్ కార్డులు తొలగిస్తారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 40 వేల కార్డులు మాత్రమేనన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు తర్వాత.. ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యం ఇస్తే నాణ్యత లేక ప్రజలు తినలేక కోళ్ల దాణాకు, ఇతర అవసరాలకు వినియోగించారని, కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలించార న్నారు. జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకంగా పేరు మారుస్తున్నామని తెలిపారు.

# ఊళ్ల నుంచి హైదరాబాద్ బాట

మొదటి పేజీ తరువాయి

చౌటుప్పల్ : సంక్రాంతి సందర్భంగా ఏపీ వైపు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. ఈ నేపథ్యంలో ఉ మ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ పెరిగింది. నల్లగొండ జిల్లా కొర్లపహాడ్, యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా మీదుగా ఆదివారం 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లాయి. పంతంగి టోల్‌గేట్ వద్ద 16 గేట్లకు గాను 12గేట్ల నుంచి హైదరాబాద్ వైపు, నాలుగు గేట్ల నుంచి విజయవాడ వైపు వాహనాలను అనుమతించారు. %కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్‌లో 12 గేట్లకు గాను హైదరాబాద్ వైపు ఆరు గేట్ల నుంచి వాహనాలను అనుమతించారు. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా 200మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించారు.



# డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందే



మొదటి పేజీ తరువాయి

గాడిన పడాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస దోపిడీ నుంచి తెలంగాణను రక్షించుకునేందుకు బీజేపీకి మద్దతివ్వాలని కిషన్‌రెడ్డి కోరారు. ఖైరతాబాద్, హిమాయత్‌నగర్‌కు చెందిన వివిధ పార్టీల నేతలు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస అనవసర విషయాలపై పరస్పర ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ, అవినీతి, అక్రమాలకు ఆ రెండు పార్టీలే కారణమని అన్నారు. నాడు కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టితే.. నేడు రేవంత్ కూడా అదే పని చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, కుంభకోణాల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్.. తన అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు, కేసుల నుంచి బయటపడేందుకే పరిమితమైందని అన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రకటించిన రాహుల్‌గాంధీ.. వాటిని అమలు చేసిన తర్వాతే తెలంగాణలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై రాహుల్ గాంధీ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు భారత రాజ్యాంగ గౌరవ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ఎలా దుర్వినియోగం చేసిందో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామని చెప్పారు.

# రైతుల చావులు సీఎంకు కనిపించడం లేదా?

హైదరాబాద్, జనవరి 19 : అప్పులు తీర్చాలని బ్యాంకులు చేస్తున్న వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల చావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనిపించడం లేదా ? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. గడిచిన ఏడాది కాలంలో 402 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ మరణాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఆయన ఓ పోస్టు చేశారు. రుణ భారాన్ని మోయలేక, బ్యాంకు సిబ్బంది వేధింపులు తాళలేక ఆదిలాబాద్‌లో 24 గంటల వ్యవధిలోనే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భరోసా కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, వరుసగా జరుగుతున్న రైతు ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని దుయ్యబట్టారు. రుణ మాఫీ కోసం కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూతిరిగి విసిగిపోతున్న రైతులు... భూములు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని, రూ.500 బోనస్ అని మోసం చేసి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మరణించిన రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇక, రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం జారీ చేసి ఉత్తర్వుల వల్ల లక్షల మంది నష్టపోతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు సవరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. పౌర సరఫరాల శాఖ జనవరి 11న ఇచ్చిన మెమో ప్రకారం భూపరిమితి, ఆదాయానికి సంబంధించి పదేళ్ల కిందటి నిబంధనలే ఉంచారని పేర్కొన్నారు. ఈ నిబంధనల వల్ల అంగన్‌వాడీలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, చిరుద్యోగులకు రేషన్ కార్డు జారీ అవ్వదని వివరించారు. ద్రవ్యోల్బణం ఆధారంగా ఆదాయ పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన సర్వే ఆధారంగా రే షన్ కార్డులు ఇస్తామన్న నిబంధనను కూడా మార్చాలని హరీశ్‌రావు కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆరున్నర లక్షల రేషన్ కార్డులు జారీ చేశామని గుర్తు చేశారు. రేషన్‌లో సన్న బియ్యాన్ని ఇవ్వాలని, రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా మార్పు చేసి డీలర్లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇవ్వాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.

# మహా కుంభమేళాలో సిలిండర్ పేలుడు



మొదటి పేజీ తరువాయి

సిబ్బంది, ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారు. మంటలు అదుపులోకి వచ్చి, సాధారణ పరిస్థితులు ఏర్పడేదాకా సమీపం లో ఉన్న భక్తులను అక్కడి నుంచి అధికారులు ఖాళీ చేయించారు. మౌని అమావాస్య కోసం ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, అగ్ని ప్రమాదం గురించి తెలియడంతో ఘటనాస్థలికి వెళ్లారు. ఇకముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆయన ఆదేశించారు. మహాకుంభమేళాలో అగ్ని ప్ర మాదం ఘటన గురించి తెలియడంతో ప్రధాని మోదీ, యోగికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కాగా అఖాడాల్లో యాగాలు జరుగుతుంటాయి కాబట్టి పొగ రావడం మామూలే. కానీ.. పెద్ద ఎత్తున మంటలు రావడంతో భయాందోళనకు గురయ్యామని స్థానికులు చెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
20 జనవరి
2025



# యాదగిరిగుట్టలో భక్తుల కిట...కిట!!

**ధర్మదర్శనానికి మూడు, స్పెషల్ దర్శనానికి గంట సమయం**
**ఆదివారం ఆలయ ఖజానాకు రూ.51.40 లక్షల ఆదాయం**



## శ్రీస్వామి వారి ఆదాయము వివరాలు

లక్ష్మీ నరసింహ స్వామి వారి ఖజానాకు వివిధ పూజలు విభాగాల నుంచి ఆదివారం రూ:- 51,40,252 ఆదాయం సమకూరిందని యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. భాస్కరరావు తెలిపారు.
శ్రీ స్వామి వారికి 2700మంది భక్తులు తలనీలాలు సమర్పించారన్నారు.

**కళ్యాణ కట్ట. 1,35,000/-**
**ప్రధాన బుకింగ్ 1,75,450 /-**
**కైంకర్యములు 300 /-**
**సుప్రభాతం 18,500 /-**
**బ్రేక్ దర్శనం 4,70,100/-**
**వ్రతాలు 1,38,400 /-**
**వాహన పూజలు 9,700/-**
**VIPదర్శనం. 9,75,000. /-**
**ప్రచారశాఖ 38,500/-**
**పాతగుట్ట 49,390/-**
**కొండపైకి వాహన ప్రవేశం 6,50,000/-**
**యాదఋషి నిలయం 2,71,187/-**
**సువర్ణ పుష్పార్చన 1,01,748/-**
**శివాలయం 10,300 /-**
**శాశ్వత పూజలు %అఅశ్రీశ్రీ/-**
**పుష్కరిణ 2000 /-**
**ప్రసాదవిక్రయం. 2,0,62,120 /-**
**లాకర్స్ 340 /-**
**అన్నదానం 16,413 /-**
**విమాన గోపురం 6,804 /-**
**ఇతరములు 6,000 /-**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సండే హాలిడే కావడంతో.. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు ఎక్కడ చూసినా భక్తులతో సందడిగా కనిపించాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వెయిట్ చేయాల్సి వచ్చిందని భక్తులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో.. నారసింహుడి ధర్మదర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో.. కొండపైన, కిందా ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. కొండ కింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, కల్యాణకట్ట, అన్నదాన సత్రం, పార్కింగ్ ప్రదేశం.. కొండపైన బస్ బే ఏరియా, దర్శన, ప్రసాద క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో జనసంద్రమయ్యాయి. ఆలయంలో నిర్వహించిన నారసింహుడి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.51,40,252 ఆదాయం సమకూరింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.20,62,120, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.50 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.9.75 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.4,70,100 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.









# గుట్ట లక్ష్మీ నరసింహుని సేవలో ఎంపీ లక్ష్మణ్

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ముఖ మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, మండల అధ్యక్షురాలు గుంటుపల్లి మహేశ్వరి సత్యనారాయణ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, మండప నాయకుడు బండపల్లి సాయి గౌడ్ తదితరులు ఉన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
20 జనవరి
2025





# పది పరీక్షల్లో... సీజీపీఏ విధానాన్ని కొనసాగించాలి

## రాష్ట్ర ప్రభుత్వానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాధుల మధుసూధన్ విజ్ఞప్తి

## విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వము వెంటనే స్పందించాలి




హైదరాబాద్, రోమింగ్ న్యూస్: సీజీపీఏ విధానం విద్యార్థులపై మార్కుల ఒత్తిడిని తగ్గించి, భావనాపరమైన విద్యను మరియు నైపుణ్యాల అభివృద్ధిని ప్రోత్సహించిందని సిజిపిఏ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలని ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు, రాష్ట్ర కోశాధికారి పీ. రాఘవేంద్ర రెడ్డిలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కి సమర్పించిన వినతిపత్రంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు W.P. నెం. 13629/2012లో హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సీజీపీఏ విధానాన్ని తీసుకురావడం వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గిందని చెప్పారు. మార్కుల ప్రాతిపదికన మారడం వల్ల విద్యార్థుల్లో మళ్లీ ఆందోళన... మరియు ఒత్తిడి పెరిగే అవకాశం ఉ ఒదన్నారు.

**సమగ్రమైన మూల్యాంకనం**

సీజీపీఏ విధానం ప్రాజెక్టులు, అసైన్మెంట్‌లు మరియు తరగతి ప్రవేశాల ద్వారా విద్యార్థులను సమగ్రంగా ఆహ్వానిస్తుందన్నారు. ఈ విధానం తొలగించడం విద్యార్థుల విభిన్న సామర్థ్యాలను గుర్తించడంలో పరిమితులను కలిగిస్తుందన్నారు ప్రతి విద్యార్థికి అనువుగా గ్రేడింగ్ విధానం సాధారణ మరియు సగటు కంటే తక్కువ మేధావులైన విద్యార్థులకు కూడా ప్రోత్సాహకరంగా ఉ ఒటుందన్నారు. ఇది మార్కుల ప్రాతిపదికన వారిని నిరుత్సాహపరచకుండా, మెరుగుపరుచుకునే అవకాశాన్ని కల్పిస్తుందనీ తెలిపారు.

28.11.2024న విడుదలైన మెమో నెం. 14572/%SE.PToSII/A%1/2022ను ఉ పసంహరించుకోవాలని మరియు భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం సీజిపిఏ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముందుగా మార్కుల ప్రాతిపదికన రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రకటించే అనారోగ్యకరమైన విధానాన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు అమలు చేసేవి. ఇది విద్యా సంస్థల మధ్య పోటీని ప్రోత్సహించడంతోపాటు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని కలిగించిందన్నారు. అప్పటి ప్రభుత్వం ఈ పరిస్థితిని గమనించి, జివోఆర్‌టి నెం. 592 మరియు జివో. నెం. 419ని విడుదల చేసి, ఎస్.ఎస్.సీ పబ్లిక్ పరీక్షలలో మార్కుల స్థానంలో సీబీఎస్ఈ మోడల్ ప్రకారం సీజీపీఏ విధానాన్ని అమలు చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు WP నెం. 13629/2012లో ఎస్.es. సీ పబ్లిక్ పరీక్షలలో సీజీపీఏ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందనీ వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 28.11.2024న మెమో నెం. 14572/SE.PToSII/A1/2022 ద్వారా CGPA విధానాన్ని తొలగించి, మార్కుల ప్రాతిపదికన మళ్లీ వెళ్ళేందుకు నిర్ణయం ప్రకటించిందన్నారు.

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్‌ఈ నిర్ణయానికి సంబంధించి విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడాన్ని సమర్థించినప్పటికీ, విద్యార్థుల మానసిక శ్రేయస్సు మరియు సమగ్ర అభివృద్ధి దృష్ట్యా CGPA విధానాన్ని కొనసాగించాల్సి న అవసరం ఉ ఒదని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. సిజిపిఏ విధానం వల్ల విద్యార్థుల మానసిక శ్రేయస్సు మరియు విద్యా ప్రాముఖ్యతను పెంపొందించడానికి ప్రభుత్వం పట్ల సహకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

# టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేటు ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి

## ప్రముఖ విద్యావేత్త కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేటు ఉపాధ్యాయులకు తప్పకుండా ఓటు హక్కును కల్పించాలని ప్రముఖ విద్యావేత్త ట్రస్మా రాష్ట్ర నాయకులు, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ నేషనల్ అడ్వైజర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి కోరారు. హైదరాబాదులో ఆయన ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అక్షరాస్యతకు ప్రైవేట్ స్కూల్స్ ఎంతగానో పాటుపడుతున్నాయని చెప్పారు. 60 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. ఎంతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తూ అక్షరాస్య శాతంలో 60 శాతం బాధ్యతను తీసుకుంటున్న ప్రైవేటు ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఇవ్వకపోవడం వల్ల ప్రజాస్వామ్య భావన దెబ్బతింటుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో టీచర్ ఏ టీచర్ అయినా టీచరే...

దీనిలో ప్రభుత్వ ప్రైవేటు అని చూడకూడదు... విద్యార్థికి బోధించే బోధనలో ప్రభుత్వ ప్రైవేటు తేడాలు ఉండవని నాణ్యమైన విద్యను మాత్రమే బోధిస్తారు... అనే విషయాన్ని అర్థం చేసుకోవాలని ఎలక్షన్ కమిషన్ కు చేసిన విజ్ఞప్తిలో ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పించడం వల్ల ఈ వృత్తులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని చెప్పారు. ప్రైవేట్ టీచర్లకు సరైన గుర్తింపు లేదని నేపథ్యంలో వారికి సముచిత గౌరవం దక్కించడం అవసరమని చెప్పారు. క్వాలిటీతో కూడిన ఉపాధ్యాయులు ఈ వృత్తిలోకి రావడంలేదని, ఇలాంటి ప్రోత్సాహకాలు ఇచ్చినట్లయితే ఎక్కువ మంది ఆకర్షితులు అవుతారని చెప్పారు. ఫలితంగా మంచి విద్య బోధన విద్యార్థులకు అందుతుందని చెప్పారు.

**విద్యా ప్రపంచంలో ప్రైవేట్ స్కూల్స్ టీచర్ల పాత్ర ప్రశంసనీయం**

విద్యా ప్రపంచంలో బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ పాత్ర ప్రశంసనీయమని అందులో పని చేసే ప్రతి ఉపాధ్యాయుడు టీచర్ ఎమ్మెల్సీకి అర్హుడని గతంలో ఎలక్షన్ కమిషన్ నుంచి ఆదేశాలు కూడా వచ్చాయన్నారు. అవి ప్రస్తుతం ఇంప్లిమెంట్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలక్షన్ కమిషన్ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు తప్పనిసరిగా ఓటేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు. కొంతమంది అధికారులు అక్కడక్కడ సహకరిస్తున్నప్పటికీ చాలాచోట్ల ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని ఇవ్వడం లేదని వివరించారు. ఈ విషయంలో న్యాయం జరగకపోతే కోర్టును కూడా ఆశ్రయిస్తామని ఆయన వెల్లడించారు.

# పర్యావరణ పరిరక్షణ వినతులపై ఏపీ నేతల సానుకూలత

**ఎన్విరాన్మెంట్ ఆక్టివిస్ట్ పత్రిక ఆవిష్కరించిన హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ పొలిటిబ్యూరో సభ్యులు వర్ల రామయ్య.**






హైదరాబాద్, రోమింగ్ న్యూస్: పర్యావరణ సమతుల్యత ను యుద్ధ ప్రాతిపదికన కాపాడుకోవాల్సిన అవసరముందని, అందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొనేలా కృషి చేయాలని ఏపీ హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తదితరులకు 'ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ %డ% డెవలప్మెంట్ కౌన్సిల్' విజ్ఞప్తి చేసినట్లు కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య ఆదివారం బాగ్ లింగం పల్లి లోని కౌన్సిల్ కార్యాలయంలో విలేకరులతో వెల్లడించారు. రంగయ్య గడచినా రెండు, మూడు రోజులుగా ఏపీ లోని పలువురు, నాయకులు, ఉన్నత అధికారులను కలిసి పర్యావరణ పరిరక్షణకు తగు చర్యలకై విజ్ఞప్తి చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ ఉత్పత్తులను అందుబాటులోకి తూసుకొచ్చేలా, జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్న వ్యవసాయ విధానాలను ప్రకృతి - సేంద్రియ విధానాలతో మార్పు చేయాలానే పలు విజ్ఞప్తు లతో రంగయ్య కౌన్సిల్ పర్యటనలో భాగంగా హోమ్ మంత్రి, అధికార పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యలకు విన్నవించారు. కౌన్సిల్ విజ్ఞప్తికి సానుకూలత వ్యక్తం చేశారు. కాగా పర్యావరణ పరిరక్షణ ప్రచారం లో కీలకమైన పత్రిక తాజా సంచికను వారు ఇరువురు వేర్వేరుగా ఆవిష్కరించారు. కౌన్సిల్ విజ్ఞప్తి చేస్తున్న పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకమైన అంశమని, ఈ విషయాన్ని. ' మా అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకుపోతానని వర్ల రామయ్య హామీ ఇచ్చారు. ఇదే సమస్యను కౌన్సిల్ టీడీపీ అధికార ప్రతినిధి, సీనియర్ పాత్రకేయులు పాతర్ల రమేష్ దృష్టికి తీసుకుపోగా సానుకూల స్పందన లభించిందని రంగయ్య సంతోషం వ్యక్తం చేశారు. కాగా ఈ పర్యటనలో కౌన్సిల్ ఏపీ కన్వీనర్ గిద్దా శ్రీనివాస నాయుడు, ఏపీ ఉపాధ్యక్షురాలు అన్నెం కుసుమ పాల్గొన్నారు.

# త్వరలో పాడ్ కార్లు

**2 ఎలివేటెడ్ కారిడార్లలో 14.8 కి.మీ.లలో ఏర్పాటు**

**1,480 కోట్ల రూపాయల అంచనా వ్యయం**

**ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌జామ్‌కు చెక్**

**రోజూ లక్ష మంది ప్రయాణం**

**హైదరాబాద్ మెట్రో రైల్ ప్రణాళిక.. డీపీఆర్ సిద్ధం**

**త్వరలో సర్కార్‌కు అందజేత**




హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ ట్రాఫిక్ జామ్.. నత్తను తలపించే వేగం..! ఈ పరిస్థితికి మెట్రోరైల్ కొంత వరకు చెక్ పెట్టినా.. ఐటీ కారిడార్‌లో మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకోవడం గగనంగా మారే పరిస్థితి..! మెట్రో స్టేషన్ నుంచి నేరుగా కార్యాలయాలకు.. బహుళ జాతి సంస్థల్లో విధులకు.. బహుళ అంతస్తుల భవనాలకు ప్రత్యేక మార్గాల్లో నేరుగా వెళ్లగలిగితే ఎలా ఉంటుంది? అచ్చంగా ఇలాంటి వ్యవస్థనే నగరంలో అందుబాటులోకి తీసుకురావాలని హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్‌ఎంఆర్‌ఎల్) సంకల్పించింది. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్(పీఆర్‌టీ) లేదా పాడ్‌ట్యాక్సీ పేరుతో కొత్త రవాణా వ్యవస్థను పరిచయం చేయాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థలో భాగంగా పాడ్ కార్ లేదా పాడ్ ట్యాక్సీలను పరిచయం చేసి.. ప్రత్యేక కారిడార్లలో వాటిని నడిపేందుకు రూ.1,480 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించి, అనుమతులు, నిధులు కోరనున్నట్లు తెలుస్తోంది.

రెండో దశ మెట్రోరైల్ ప్రాజెక్టు పూర్తయ్యేలోగా(2029 లక్ష్యం) పాడ్ కార్లను అందుబాటులోకి తీసుకువచ్చే దిశలో వడివడిగా అడుగులు వేస్తోంది. హైటెక్‌సిటీ, కొండాపూర్, మాదాపూర్, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లోని మెట్రోస్టేషన్లు, కార్యాలయాలు, బహుళ అంతస్తులకు పాడ్ కార్ల సేవలను రెండు కారిడార్లలో అందుబాటులోకి తీసుకురావాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ భావిస్తోంది. మెట్రో స్టేషన్‌కు అనుసంధానంగా ప్రారంభమయ్యేలా మొదటి ఎలివేటెడ్ కారిడార్(8.8 కిలోమీటర్లు)ను రూ.880 కోట్ల అంచనాతో నిర్మిస్తారు. ఈ కారిడార్ రాయదుర్గం మెట్రో–ఐటీసీ కోహినూర్–నాలెడ్జ్‌సిటీ మధ్య ఉంటుంది. ఈ కారిడార్‌లో 28 స్టాప్‌లు ఉంటాయి. రూ.600 కోట్ల అంచనాతో రెండో కారిడార్(6 కిలోమీటర్లు)ను నిర్మిస్తారు. ఈ కారిడార్ 27 స్టాప్‌లతో రాయదుర్గం మెట్రో–టెక్‌మహీంద్రా–హైటెక్‌సిటీ/కొండాపూర్ మధ్యలో కొనసాగుతుంది. నిజానికి గత సర్కారు హయాంలోనే పాడ్ కార్లను ప్రతిపాదించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి మైండ్‌స్పేస–ఐటీసీ కోహినూర్(7.5 కిలోమీటర్లు), అసెంబ్లీ మెట్రో నుంచి సచివాలయం మీదుగా ప్యారడైజ్ స్టేషన్ వరకు(10 కిలోమీటర్లు) రెండు కారిడార్లను ప్రతిపాదించారు. 2022 వార్షిక నివేదికలోనే అప్పటి సర్కారు అల్ట్రా పీఆర్టీ లిమిటెడ్‌తో హెచ్‌ఎంఆర్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలిపింది. అయితే.. అప్పట్లో ఆ ప్రాజెక్టు ప్రతిపాదనలకే పరిమితమైంది. తాజాగా ప్రభుత్వం ఐటీకారిడార్‌లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.

ప్రతి అక్షరం.. ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
20 జనవరి
2025




# ట్రంప్ వచ్చేస్తున్నాడు!

**భారత కాలమానం ప్రకారం**
**నేటి రాత్రి 10.30కి ప్రమాణం**
**వాషింగ్టన్‌లో తీవ్ర చలి.. బహిరంగ ప్రదేశంలో నిర్వహించొద్దని నిర్ణయం**
**కేపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో ప్రమాణ స్వీకారం**
**హాజరుకానున్న మస్క్, బెజోస్, జుకర్‌బర్గ్**
**అమెరికా వ్యాప్తంగా ట్రంప్ వ్యతిరేకుల నిరసనలు.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**



మొండివాడు రాజు కన్నా బలవంతుడంటారు! కానీ.. మొండివాడే రాజైతే? విషయం ఏదైనా నిక్కచ్చిగా అభిప్రాయం చెప్పి.. నిర్మొహమాటంగా నిర్ణయాలు తీసుకునే డోనాల్డ్ ట్రంప్‌ను ఆయన విమర్శకులు 'మొండివాడు' అనే అంటారు!! అలాంటి ట్రంప్.. అమెరికా అధ్యక్షుడిగా సోమవారం మళ్లీ బాధ్యతలు చేపట్టనున్నారు. అమెరికా అధ్యక్షుడంటే ఆ ఒక్క దేశానికి మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి ఆలోచనల ప్రభావం ప్రపంచమంతా ఉంటుంది!! అందునా ట్రంప్ లాంటి దూకుడు మనస్తత్వం ఉన్న వ్యక్తి అయితే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో.. పలు అంశాలపై గత కొన్ని నెలలుగా ఆయన చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఆయన వైఖరి ఎలా ఉండవచ్చో నిపుణులు విశ్లేషిస్తున్నారిలా..

## భారత్‌పై పన్నుల భారం?

ట్రంప్ తొలి హయాంలో అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడ్డాయి. కానీ.. వాణిజ్యం విషయంలో మాత్రం ఆయన పలుమార్లు ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత్ విధించే సుంకాలపై గట్టిగానే చిర్రుబుర్రులాడారు. 2019లో.. భారత్‌ను 'టారిఫ్ కింగ్'గా కూడా అభివర్ణించారాయన! అప్పటిదాకా భారత్‌కు ఉన్న 'జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జీఎస్పీ)'ని రద్దు చేశారు. గత ఏడాది డిసెంబరులో సైతం.. భారత్ విధిస్తున్న సుంకాలపై ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అమెరికా ఉత్పత్తులపై భారత్, బ్రెజిల్ వంటి దేశాలు అత్యధికంగా 100%, 200% పన్నులు వేస్తున్నాయి.. దేనికైనా ప్రతిచర్య ఉంటుంది. వారు మాపై పన్నులు వేస్తే మేమూ అదే స్థాయిలో వసూలు చేస్తాం" అంటూ రివెంజ్ ట్యాక్స్ గురించి మాట్లాడారు. కాబట్టి వాణిజ్యంలో ఇరుదేశాల మధ్య ఘర్షణ.. పన్నుభారం తప్పకపోవచ్చు.

## హెచ్1బీపై మెతక వైఖరి?

హెచ్1బీ వీసాలపై ట్రంప్ గతంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేసేవారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1బీ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే దరఖాస్తుల వడపోతను కఠినతరం చేశారు. కానీ, ఇప్పుడు.. హెచ్1బీ వీసాలను సమర్థించే ఈలన్ మస్క్, వివేక్ రామస్వామి వంటివారు తన పక్కనే ఉన్న నేపథ్యంలో ఇటీవలికాలంలో ఆయన స్వరం మారింది. ఆ వీసాలపై ఆయన వైఖరి మెత్తబడింది. "హెచ్1బీపై నాకు నమ్మకం ఉంది. అదొక గొప్ప కార్యక్రమం" అంటూ న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. అయితే.. ట్రంప్ మద్దతుదారుల్లోనే మరో వర్గం, అమెరికాను మళ్లీ గొప్పగా చేయాలని వాదించేవారు (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్-మాగా) మాత్రం హెచ్1బీపై తీవ్ర వ్యతిరేకత వెలిబుచ్చుతున్నారు. కాబట్టి ఆ ఒత్తిడి కూడా ట్రంప్‌పై ఉండే అవకాశం ఉంది. దాన్ని ఎలా అధిగమిస్తారో చూడాలి!!

## గ్రీన్‌లాండ్ స్వాధీనం!

అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతంలో ఉన్న గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో భాగం చేస్తామని.. అందుకు అవసరమైతే సైన్యాన్నిగానీ, ధనాన్నిగానీ ఉపయోగించడానికి సిద్ధమని ట్రంప్ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ఇంతకీ గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ దృష్టి ఎందుకు పడింది? అంటే.. ఆ దేశంలో అత్యంత అరుదైన వనరులు, నిక్షేపాలు ఉన్నాయి. యూరోపకు, ఉత్తర అమెరికాకు మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో ఉందా భూభాగం. అటువైపుగా వెళ్లే రష్యన్ నౌకలు, అణు జలాంతర్గాములపై ఒక కన్ను వేసే అవకాశం అమెరికాకు అక్కడ ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే యూఎస్ అక్కడ ఒక శాశ్వత ఎయిర్‌బేస్ ఏర్పాటు చేసింది. అన్నిటికీ మించి.. గ్రీన్‌లాండ్ భౌగోళికంగా ఉత్తర అమెరికాలో భాగం! కానీ.. రాజకీయంగా 1953 వరకూ డెన్మార్క్ వలస ప్రాంతంగా ఉంది. ఇప్పుడు స్వయంపాలిత భూభాగంగా ఉంది. గ్రీన్‌లాండ్ రాజధానికి డెన్మార్క్ రాజధాని కోపెన్‌హేగన్ కన్నా కూడా న్యూయార్కే దగ్గర. వీటిన్నింటి నేపథ్యంలోనే ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. గతంలో హ్యారీ ట్రూమన్ హయాంలో కూడా ఈ ద్వీపాన్ని 100 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. కానీ, కుదర్లేదు. ఇప్పుడు కూడా డెన్మార్క్ ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తోంది. ట్రంప్ మాత్రం ఈ విషయంలో మొండిగానే వ్యవహరించే అవకాశం ఉంది. అప్పుడు.. డెన్మార్క్‌కు బదులుగా అమెరికాతో అనుబంధంగా ఉండే నిర్ణయం తీసుకునే హక్కు గ్రీన్‌లాండ్‌కు ఉంటుంది. ఫలితంగా ఇన్నాళ్లుగా డెన్మార్క్ నుంచి గ్రీన్‌లాండ్‌కు అందుతున్న రాయితీలు అమెరికా నుంచి అందుతాయన్నమాట.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

తాను అధికారంలోకి వస్తేగనక వెంటనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ట్రంప్ గతంలో ప్రకటించారు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వబోమని హామీ ఇవ్వడం ద్వారా రష్యాను యుద్ధవిరమణకు ట్రంప్ ఒప్పించవచ్చన్నది ఒక ఆలోచన. అది ఉక్రెయిన్‌కు పెద్ద దెబ్బే. నిజానికి 2023లో అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు అందాల్సిన 61 బిలియన్ల డాలర్ల ప్యాకేజీ.. ట్రంప్ ఒత్తిడి కారణంగానే ఆగిపోయింది. అందుకే ఉక్రెయినియన్లకు ఇప్పుడు ట్రంప్ మీద ఆశలేమీ లేవు.

## పనామా కాలువ స్వాధీనం?

తీరాల మధ్య వాణిజ్య, సైనిక నౌకల రవాణాను సులభతరం చేసేందుకు అమెరికా నిర్మించిన పనామా కాలువ ప్రస్తుతం పనామా దేశ ఆధీనంలో ఉంది. 1977లో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. 1999 డిసెంబరులో ఈ కాలువపై నియంత్రణను అమెరికా కోల్పోయింది. అయితే.. ఇటీవలికాలంలో ఆ దేశం సరుకు రవాణా నౌకలపై రుసుములు పెంచేయడం, చైనాతో సత్సంబంధాలు పెట్టుకోవడం వంటి నిర్ణయాలు తీసుకుంది. అవే ట్రంప్ ఆగ్రహానికి కారణమయ్యాయి. కాబట్టి పగ్గాలు చేపట్టాక ట్రంప్ పనామాపై దూకుడుగానే వ్యవహరించే అవకాశం ఉందని అంచనా. ఇవే కాదు, వాణిజ్యలోటు భర్తీ కోసం కెనడా, మెక్సికోలను కూడా అమెరికాలో రాష్ట్రాలుగా చేరుస్తామని ట్రంప్ వ్యాఖ్యానించారు! అమెరికాకు సన్నిహితమైన యూరోపియన్ దేశాలనూ ఆయన వదల్లేదు. యూరప్ దేశాలకు, అమెరికాకు మధ్య వాణిజ్య అంతరం భారీగా ఉందని.. దాన్ని పూడ్చడానికి యూరప్ దేశాలు గ్యాస్, ఇంధనాన్ని అమెరికా నుంచే కొనుగోలు చేయాలని హెచ్చరించారు. లేదంటే ఈయూపై పన్నులు పెంచేస్తానని బెదిరించారు. భూతాప ముప్పును నివారించేందుకు పారిసలో కుదుర్చుకున్న పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలగుతానని ప్రకటించారు. ఇలా ఆయన చెప్పినవన్నీ చేస్తే ప్రపంచానికి పెనుముప్పేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## గాజా వార్ ముగిసినట్లేనా?

గాజాలో జరుగుతున్న యుద్ధం విషయంలో ట్రంప్ చాలా స్పష్టంగా హమాసకు వ్యతిరేకంగా ఉన్నారు. తాను ప్రమాణం చేసే జనవరి 20లోపు హమాసగనక తన వద్ద ఉన్న బందీలందరినీ ఇళ్లకు పంపించకపోతే ఈ దురాగతాలకు పాల్పడేవారికి నరకం చూపిస్తానని ఇటీవలే హెచ్చరికలు జారీ చేశారు. ఈ యుద్ధానికి కారకులైనవారికి గట్టి దెబ్బ పడుతుందంటూ పరోక్షంగా ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలోనే హమాస్ దిగివచ్చి ముగ్గురు బందీలను విడుదల చేసింది.

# ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ అవకాశం



హైదరాబాద్, జనవరి 19 : ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, కార్డుల్లో మార్పులు, కుటుంబ సభ్యుల చేరికల కోసం మళ్లీ దరఖాస్తులు తీసుకోనుంది. అయితే, గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలన, ఇటీవల నిర్వహించిన కులగణనలో ఈ వివరాలను వెల్లడించని వారికి ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకునేందుకు సర్కారు అవకాశం కల్పించింది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. వీటితోపాటు ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద కూలీల కుటుంబా లకు అందించబోయే ఆర్థికసాయాన్ని మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## కుటుంబ పెద్ద వారీగా వివరాలు..

కొత్త రేషన్‌కార్డులు, లేదా ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు, సభ్యుల మార్పులు, చేర్పుల కోసం తాజాగా దరఖాస్తులను తీసుకోవడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎస్ సూచించారు. గ్రామసభల్లో తీసుకోబోయే దరఖాస్తుల్లో ముఖ్యంగా కుటుంబ పెద్దతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు, సభ్యులందరి ఆధార్ నంబర్లు, కులం, ఫోన్ నంబరు సహా పూర్తి చిరునామా తీసుకుంటారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలో రేషన్‌కార్డులు లేని కుటుంబాలు 6,68,309 ఉన్నాయని కులగణనలో భాగంగా ఈ నెల 18 నాటికి ప్రభుత్వానికి అందిన వివరాల్లో తేలింది. ఇదే విషయాన్ని కలెక్టర్లకు పంపిన జాబితాలో పేర్కొన్నారు. అయితే ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో సభ్యుల చేర్పులు, మార్పులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు 12,07,895 ఉండగా, వీటి ద్వారా 18,01,033 సభ్యులు ఉన్నారు. వీటిలో కొన్ని పరిశీలన జరగ్గా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

సభ్యుల చేర్పులు, కొత్త కార్డుల కోసం మొత్తం 18,76,204దరఖాస్తులు రాగా, వీటి ద్వారా 29,66,085 మంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది. ఇవికాక కొత్తగా ఎవరైనా రేషన్ కార్డుల కోసం లేదా మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇక ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ ఇదే విధానాన్ని అనుసరించనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సోమవారం నాటికి సర్వే పూర్తవనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి వచ్చిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 18,68,572 మందికి ఇళ్ల స్థలాలు ఉండగా, 11,60,979మందికి స్థలాలు లేనట్లు గుర్తించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వానికి 80.54 లక్షల దరఖాస్తులు రాగా వీటిలో ఇప్పటివరకు ఇళ్ల స్థలం ఉన్నవారు, లేని వారు కలిపి 30,29,551 మంది ఉన్నట్లు తేలగా, మిగిలిన 50.24లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఈనెల 24 వరకు తీసుకోబోయే దరఖాస్తులపైనా అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఆ తర్వాత అర్హుల జాబితాను సిద్ధం చేస్తారు. ఇందుకు సంబంధించిన సూచనలను విడిగా ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు.

# సైఫ్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడు!

**థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అరెస్టు, కోర్టులో హాజరు**
**ఐదు రోజుల పోలీసు కస్టడీకి న్యాయస్థానం అనుమతి**



ముంబై, జనవరి 19: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేశాడనే ఆరోపణలపై మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్(30) అలియాస్ బిజయ్ దాస్ అనే బంగ్లాదేశ్ పౌరుడిని ముంబై పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో షరీఫుల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు... అతనిని బాంద్రా న్యాయస్థానంలో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడి ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ పౌరుడైన షరీఫుల్ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి బిజయ్ దాస్ అనే పేరుతో చలామణీ అవుతున్నాడని పోలీసులు న్యాయస్థానానికి తెలియజేశారు. దొంగతనం చేసేందుకు సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి చొరబడిన షరీఫుల్.. సైఫ్‌పై దాడి చేసి పరారయ్యాడని తెలిపారు. వందలాది సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన అనంతరం దాదర్ రైల్వే స్టేషన్ వద్ద నిందితుడి సంచారాన్ని గుర్తించామని, థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. షెహజాద్ బంగ్లాదేశీ కావడంతో సైఫ్‌పై దాడి వెనుక అంతర్జాతీయ కుట్ర ఏమైనా ఉందా ? అని దర్యాప్తు చేయాల్సి ఉందని వివరించారు. కాగా, సైఫ్‌పై దాడి కేసులో ఛత్తీసగఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేసిన ఆకాశ్ కైలాశ్ కనోజియాను విచారణ అనంతరం పోలీసులు విడుదల చేశారు.

# చంద్రబాబుకు మోదీ కొండంత అండ

**ఆ విధ్వంసం మర్చిపోండి మూడింతల అభివృద్ధి సాధిస్తాం**
**6 నెలల్లోనే ఏపీకి 3 లక్షల కోట్లు**
**ఎన్డీఆర్‌ఎఫ్ వేడుకల్లో అమిత్ షా**



అమరావతి, జనవరి 19 : 'రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం గురించి చింతించొద్దు. ఏపీ అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొండంత అండగా ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారు. ఇద్దరి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మూడింతల ప్రగతి సాధిస్తుంది' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఆదివారం విజయవాడ సమీపంలోని కొండపావులూరు వద్ద జరిగిన ఎన్డీఆర్‌ఎఫ్ 20వ వ్యవస్థాపక వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ ప్రాంగణంలో నిర్మించిన ఎన్ఐడీఎం దక్షిణ సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రక్షించేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ వస్తుందని, మానవ విధ్వంసం నుంచి కాపాడేందుకు ఎన్డీయే ముందుంటుందని వ్యాఖ్యానించారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రాష్ట్రానికి మూడు లక్షల కోట్ల రూపాయల సహకారం అందించామన్నారు. అమరావతి నిర్మాణానికి నిధులిచ్చామని, 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు నీళ్లు రాష్ట్రంలోని పొలాల్లో పారిస్తామన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రైల్వే జోన్ ఏర్పాటైందని, తాజాగా విశాఖ ఉక్కుకు ఊతమిచ్చి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచామని అమిత్ షా పేర్కొన్నారు.

## ఏపీకి కేంద్రం తోడ్పాటు

'అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఆర్థిక నిర్వహణలో మంచి అనుభవం ఉన్న చంద్రబాబు కష్టానికి కేంద్రం తోడ్పాటు ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిన రాజధాని అమరావతికి గడిచిన ఆరు నెలల్లోనే 27 వేల కోట్ల రూపాయల భరోసాతో ఏపీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచాం. ఇటీవలే రాష్ట్రపతి చేతుల మీదుగా ఎయిమ్స్ ప్రారంభమైంది. రాష్ట్రంలో రూ. 1.20 లక్షల కోట్లతో జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు' అని అమిత్ షా వెల్లడించారు.

## ఎన్డీఆర్‌ఎఫ్ సేవలు భేష్

'గతంలో ఒడిశాలో తుఫాన్లు వస్తే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల రెండు తుఫాన్లు వచ్చినా ఎన్డీఆర్‌ఎఫ్ ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవడం వల్ల ఒక్క ప్రాణం కూడా పోలేదు. మోదీ పాలనలో జీరో క్యాజువాలిటీ లక్ష్యం నిర్దేశించుకుని పని చేస్తున్నాం. విపత్తుల్లో చిక్కుకున్న ప్రజలు ఎన్డీఆర్‌ఎఫ్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తుల్ని చూడగానే ధైర్యం వచ్చిందని నాకు చాలా చోట్ల చెప్పారు. జపాన్, నేపాల్, మయన్మార్, టర్కీ తదితర దేశాల అధ్యక్షులు సైతం ఎన్డీఆర్‌ఎఫ్ సేవల్ని కొనియాడారు' అని అమిత్ షా వివరించారు.

## పోలీస్ అకాడమీలో ఇండోర్ షూటింగ్ రేంజ్ వర్చువల్‌గా ప్రారంభించిన అమిత్ షా

సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో ఇంటిగ్రేటెడ్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఆదివారం ఈ షూటింగ్ రేంజ్‌ను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. స్వయంగా హాజరు కావాల్సి ఉన్నా.. సమయాభావం వల్ల ఆయన రాలేకపోయారు. ఇంటిగ్రేటెడ్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌లో ఒకేసారి పది మంది శిక్షణ పొందవచ్చు. 50మీటర్ల పొడవు, పది వరుసల్లో ఈ షూటింగ్ రేంజ్ ఉంటుంది. ఆధునిక తుపాకుల వినియోగంపై ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక




# ఫ్యూచర్ సిటీ లక్ష్యంగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి

- రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు 41.5 కి.మీ. మేర నిర్మాణం
- భూసేకరణ ప్రక్రియపై ఉన్నతాధికారుల దృష్టి



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఏర్పాటుపై వేగంగా అడుగులు వేస్తోంది. అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) పరిధిలోని ఎగ్జిట్ నంబరు-13(రావిర్యాల) నుంచి రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగంలోని ఆమనగల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మించనున్నారు. భూసేకరణ కోసం ఇప్పటికే రెండు విడతలుగా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 8,500 ఎకరాల భూములు సేకరించాల్సి ఉందని అధికారులు గుర్తించారు. ఓఆర్ఆర్ నుంచి మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నారు. ఈ మండలాల పరిధిలోని మొత్తం 26 గ్రామాల మీదుగా రోడ్డు ఏర్పాటు కానుంది. మొదటి దశలో ఓఆర్ఆర్ ఎగ్జిట్-13(రావిర్యాల) నుంచి కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. తాజాగా ఇక్కడి నుంచి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో నిర్మించే రహదారి వరకు(ఆమనగల్లు) వరకు భూసేకరణ కోసం రెండో విడత నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ప్రాంతంలో మొత్తం 15 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని బహుళజాతి పరిశ్రమలకు, విదేశీ పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలకు ముఖ్యమంత్రి పిలుపునిస్తున్నారు. ఈ ప్రాంతం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఏర్పాటు చేస్తే పెట్టుబడులకు మరింత అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్, సైబరాబాద్‌లకు త్వరగా చేరుకోవడానికీ ఆస్కారం ఉంటుంది. గ్రీన్‌ఫీల్డ్ రహదారి భూసేకరణకు పలుచోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వే కోసం వస్తున్న అధికారులను గ్రామాలకు రానివ్వడం లేదు. ఇక్కడి భూములకు భారీగా ధర పలుకుతుండడంతో మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదా తమ భూమికి ప్రత్యామ్నాయంగా మరోచోట అంతే విలువున్న భూమిని ఇవ్వాలని కోరుతున్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి స్థానిక అధికారులు తీసుకెళ్లారు. రైతులతో చర్చలు జరిపి భూసేకరణ ప్రక్రియ సాఫీగా జరిగేలా వారు దృష్టి సారిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణమై ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందితే ఈ ప్రాంతం స్వరూపమే మారిపోతుందని గ్రామస్థులకు వివరిస్తున్నారు. వారిని సాధ్యమైనంత త్వరగా ఒప్పించి, భూసేకరణ పూర్తిచేసి.. గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



## పిల్లలకు మాతృభాష గొప్పతనం వివరించడం తల్లిదండ్రుల బాధ్యత

- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఘనంగా 'తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం-25'

**హైదరాబాద్, జనవరి 19 :** పిల్లలకు మాతృభాష గొప్పదనం గురించి అర్థమయ్యేలా చెప్పడం తల్లిదండ్రుల బాధ్యత అని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. పరభాషలెన్ని నేర్చుకున్నా తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. తెలుగు సంగమం వ్యవస్థాపకుడు మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా నార్సింగిలో నిర్వహించిన 'సంక్రాంతి సమ్మేళనం-2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు సంస్కృతి, భాషా మాధుర్యం, విశిష్టతలను రాబోయే తరాలకు తెలియజేయటానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వస్థలాలకు దూరంగా స్థిరపడిన వారు సంక్రాంతి రోజున వారివారి గ్రామాలకు చేరుకోవడం, పండగను సంతోషంగా బంధువులు, స్నేహితులతో చేసుకోవడం ఆనందదాయకమన్నారు. ఏపీలోని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. తమిళనాడు తరహాలో తెలుగు వారు కూడా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వడంలో నిబద్ధత చాటాలన్నారు. సినీనటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణంలో తెలుగు భాష ఒక మూలస్తంభంగా నిలిచిందన్నారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డా.కూచిభొట్ల ఆనంద్ మాట్లాడుతూ.. ఆహారం, ఆహార్యం కలిపితేనే తెలుగుదనమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ, భగవద్గీత ఫౌండేషన్ స్థాపకుడు డా.ఎల్.వి.గంగాధరశాస్త్రి, ఏలూరు జిల్లా కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ తదితరులు మాట్లాడారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన వారిని ఘనంగా సన్మానించారు.

# షరతులు లేకుండా సంక్షేమ పథకాలు

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**



**ఖమ్మం :** షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఈ నెల 26 నుంచి అమలు కానున్న 4 పథకాలకు సంబంధించి అందరి సమక్షంలో గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడులో రూ.1.06 కోట్లతో ఏర్పాటు చేసిన ఆసుపత్రి భవనం, రూ.48 లక్షలతో నిర్మించిన సహకార సంఘం భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రూ.60 లక్షలతో పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 31 గ్రామాలకు చెందిన భారాస నాయకులు సఖినవీడు గ్రామంలో భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బనిగండ్లపాడు, సఖినవీడులో ఏర్పాటుచేసిన సభల్లో భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా ఎక్కడా తయారు కాలేదని, గ్రామసభల్లోనే అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంపద పంచుతున్నామని చెప్పారు. విపక్షంలో ఉండగా ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన పాదయాత్రలో రైతులు, కూలీలు, నిరుద్యోగులు, మహిళల కష్టాలు తెలుసుకున్నానని, వారంతా ప్రజాపాలన రావాలని వందల కిలోమీటర్లు తన వెంట నడిచారన్నారు. పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన భారాస నాయకులు పథకాలకు అడ్డుపడుతున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులమంతా గత ప్రభుత్వ అప్పులను తీర్చుతూ రూ.21 వేల కోట్లతో రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు నిర్విరామంగా అందిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధికి అందరూ కలిసి రావాలని భట్టి పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి కళావతి తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్బందులున్నా పథకాలు అందిస్తున్నాం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నిజామాబాద్, జనవరి 19 :** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న సన్నద్ధతపై ఆయన నిజామాబాద్ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ నగరంలో అమృత్ 2.0 పథకం భాగంగా రూ.380 కోట్లతో తాగునీటి వనరుల అభివృద్ధి, వరద, మురుగు కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన, నగర పాలక సంస్థ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. బాధిత మహిళలకు పోలీసు శాఖ ద్వారా సేవలందించే భరోసా కేంద్రాన్ని డీజీపీ జితేందర్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారాస ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని, నెలకు రూ.6500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల సంఖ్య కుదించి పేదలకు అన్యాయం చేసే ఆలోచన లేదన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందని, అర్హులందరికీ అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, లక్ష్మీకాంతరావు, వెంకటరమణారెడ్డి, కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశిష్ సాంగ్వాన్, మైనార్టీ కమిషన్ ఛైర్మన్ తారీఖ్ అన్సారీ పాల్గొన్నారు.



## పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం

**- ఎమ్మెల్సీ కవిత**

**నిజామాబాద్ జనవరి 19 :** కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రారంభించిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం భాజపా నేతలే పాల్గొని.. సొంత పార్టీ కార్యక్రమంలా మార్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం బాధాకరమన్నారు. నిజామాబాద్‌లో ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. పసుపు బోర్డు కోసం దశాబ్ద కాలం తాను ప్రయత్నాలు చేశానన్నారు. పసుపు బోర్డు ఈ ప్రాంత రైతుల కల అని, రాజకీయాల కోసం ఏర్పాటు చేసినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. "పసుపు బోర్డు అంబాసిడర్ కారైతే.. స్పైస్ బోర్డు బెంజి కారు లాంటిది.. అని పోల్చిన ఎంపీ అర్వింద్ ఇప్పుడెలా సమర్థించుకుంటారు" అని కవిత ప్రశ్నించారు. ఎన్డీయే హయాంలో పసుపు దిగుమతులు రెట్టింపయ్యాయని, వీటిని తగ్గించకుంటే మన పంటకు డిమాండ్ ఏర్పడే పరిస్థితి లేదన్నారు. బోర్డు తొలి ఛైర్మన్‌గా ఎన్నికైన పల్లె గంగారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ.. అందరినీ కలుపుకొని వెళ్లి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు.

## కొమురవెల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**సిద్దిపేట, జనవరి 19 :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాం తి పండగ తర్వాత వచ్చే మొదటి ఆదివారం నుంచి మొ దలయ్యే ఉత్సవాలు రెండున్నర నెలల పాటు జరుగుతాయి. ఉగాది పండగకు ముందు వచ్చే ఆదివారం అర్ధరాత్రి తర్వాత నిర్వహించే అగ్నిగుండం కార్యక్రమంతో బ్రహ్మో త్సవాలు ముగుస్తాయి. మొదటి వారాన్ని 'పట్నం వారం'గా పిలుస్తారు. శనివారం సాయంత్రమే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మల్లికార్జునస్వామిని ధూళి దర్శనం చేసుకున్నారు. ఆదివారం నైవేద్యం వండి, పాత్రలను అలంకరించి, పూనకాలతో ఊగిపోతూ మల్లన్నకు, గుట్టపై ఉన్న రేణుకా ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. ఆదివారం సుమారు 70 వేల మందికి పైగా భక్తులు దర్శిం చుకున్నారని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. సోమవారం 'పట్నం-అగ్నిగుండం' కార్యక్రమాలను హైదరాబాద్ భక్తులు సొంత ఖర్చులతో నిర్వహిస్తారు.



## మద్దతు ధర చట్టం అమలు చేయాలి

**అఖిల భారత రైతుకూలీ సంఘం డిమాండ్**

**మహబూబాబాద్, జనవరి 19 :** వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని ఉపసంహరించి, పంటలకు కనీస మద్దతు ధర చట్టం అమలు చేసి రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం న్యూ డెమోక్రసీ అనుబంధ ఏఐకేఎంఎస్ రాష్ట్ర స్థాయి విలీన సభ నిర్వహించారు. ముందుగా పట్టణంలో అరుణోదయ కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వర్‌రావు, భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన విలీన సభలో వేములపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు భరోసా పెంచి రైతును రాజు చేస్తామని, పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది దాటినా అమలు చేయలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు వ్యవసాయ రంగానికి చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మండల వెంకన్న, గౌని ఐలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యమని రెండు ఏఐకేఎంఎస్ సంఘాలు విలీనమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ముక్తి సత్యం, జడ సత్యనారాయణ తదితరులున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
20 జనవరి
2025







# రోహిత్ మళ్లీ విశ్వరూపం చూపిస్తాడు

## - సురేశ్ రైనా

టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ వచ్చే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో 2019 ప్రపంచ కప్ మాదిరిగా దంచికొడతాడని భారత మాజీ ఆటగాడు సురేశ్ రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు. 2019 వరల్డ్ కప్‌లో రోహిత్ విశ్వరూపం ప్రదర్శించాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 81 సగటుతో 648 రన్స్ (ఐదు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ) చేసి టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే, ఇటీవల హిట్‌మ్యాన్ జోరు తగ్గింది. బ్యాటర్‌గా వరుస మ్యాచ్‌ల్లో విఫలమవుతూ అభిమానులను నిరాశపరుస్తున్నాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో చివరి టెస్టుకు స్వయంగా జట్టు నుంచి వైదొలిగాడు. ఈ నేపథ్యంలోనే రోహిత్ తిరిగి పుంజుకుంటాడని సురేశ్ రైనా పేర్కొన్నాడు. "2011 ప్రపంచకప్ జట్టుకు ఎంపికకాకపోవడంతో రోహిత్ చాలా బాధపడ్డాడు. తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2013తో ఆ లోటును తీర్చుకున్నాడు. మేం చివరగా (2013) ఇంగ్లాండ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. అయితే, ప్రస్తుతం దుబాయ్ వేదికగా భారత్ మ్యాచ్‌లు ఆడనుంది. అక్కడి పరిస్థితులు ఇంగ్లాండ్ కంటే పూర్తిగా భిన్నంగా ఉంటాయి. యూఏఈలో ఎలా ఆడాలో రోహిత్‌కు తెలుసు. ఒకవేళ అతను 20-25 ఓవర్ల వరకు ఆడితే 2019 వరల్డ్ కప్ ప్రదర్శన పునరావృతం చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని రైనా పేర్కొన్నాడు.

### సూర్యకుమార్ ఉంటే..

ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కకపోవడంపై రైనా స్పందించాడు. 'సూర్య ప్రపంచ కప్ జట్టులో అంతర్భాగంగా ఉన్నాడు. అతను గేమ్‌లో ఏ దశలోనైనా ఓవర్‌కు 9 పరుగుల చొప్పున స్కోర్ చేయగల సమర్థుడు. విభిన్నంగా బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించగలడు. ఒకవేళ సూర్య జట్టులో ఉంటే ఎక్స్ ఫ్యాక్టర్‌గా ఉండేవాడు. కానీ, ఫామ్‌లో లేని టాప్ 3 బ్యాటర్లపై ఇప్పుడు బాధ్యత ఉంటుంది. శుభ్‌మన్ గిల్ సరైన సమయంలో వైస్ కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నాడు. అతను భారత క్రికెట్ భవిష్యత్ సూపర్ స్టార్. వన్డేల్లో ఇప్పటికే సత్తాచాటాడు. గిల్‌ను ఎలా ముందుకు నడిపించాలో రోహిత్‌కు తెలుసు' అని సురేశ్ రైనా వివరించాడు.



# నిబంధనల గురించి మాట్లాడాలి!

## - బీసీసీఐ నియామవళిపై రోహిత్

**ముంబయి:** ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్ఇండియా వైఫల్యం నేపథ్యంలో భారత క్రికెట్లో ప్రక్షాళన కోసం బీసీసీఐ 10 అంశాలతో నియమావళి రూపొందించిందనే ప్రచారం జోరుగా సాగుతోన్న సంగతి తెలిసిందే. దీనిపై బీసీసీఐ ఇంకా అధికారిక సమాచారం వెల్లడించనప్పటికీ ఆ నియమావళి బయటకు వచ్చింది. దీనిపై తాజాగా రోహిత్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. శనివారం సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అగార్కర్‌తో కలిసి రోహిత్ విలేకర్ల సమావేశంలో పాల్గొన్నాడు. ఆ సమావేశం ప్రారంభమయ్యే ముందు అగార్కర్‌తో రోహిత్.. "కుటుంబ సభ్యుల (ప్రయాణం) గురించి కార్యదర్శితో కూర్చుని మాట్లాడాలి. అందరూ (ఆటగాళ్లు) నన్ను అడుగుతున్నారు" అని చెప్పాడు. రోహిత్ ఇది అధికారికంగా చెప్పకపోయినా అక్కడి మైక్రోఫోన్‌లో రికార్డయింది. అనంతరం ఈ నియమావళి గురించి ప్రశ్నించగా.. 'ఈ నిబంధనల గురించి మీకు ఎవరు చెప్పారు? బీసీసీఐ చెప్పిందా? అధికారికంగా సమాచారం రానివ్వండి" అని రోహిత్ బదులిచ్చాడు. సుదీర్ఘ కాలం సాగే పర్యటనలో ఆటగాళ్లతో కుటుంబ సభ్యులు కేవలం 14 రోజులు మాత్రమే ఉండాలని ఈ నిబంధనల్లో బీసీసీఐ పేర్కొన్నట్లు తెలిసింది. అయితే ప్రతి జట్టుకు నిబంధనలు ఉంటాయని అగార్కర్ చెప్పాడు. ఇదేమీ పాఠశాల కాదని, దీన్ని శిక్షగా చూడాల్సిన అవసరం లేదన్నాడు. ఇక కోచ్ గంభీర్‌కు, తనకు మైదానంలో ఏం చేయాలన్న దానిపై స్పష్టత ఉందని రోహిత్ పేర్కొన్నాడు. కెప్టెన్‌గా తనపై గంభీర్‌కు నమ్మకముందని రోహిత్ చెప్పాడు.



# ఖో ఖో ప్రపంచకప్‌లో ఫైనల్లో భారత్

**న్యూఢిల్లీ:** అరంగేట్రం ఖోఖో ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ అదరగొడుతున్నది. గ్రామీణ క్రీడలో తమకు తిరుగులేదని చాటిచెబుతూ మెగాటోర్నీలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. శనివారం జరిగిన వేర్వేరు సెమీస్ మ్యాచ్‌లో మన జట్లు దుమ్మురేపాయి. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పురుషుల సెమీస్‌లో భారత్ 62-42తో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. పాయింట్ల కోసం ఇరు జట్లు హెూరాహెూరీగా తలపడ్డాయి. తొలి టర్న్‌లో ప్రతీక్ వైకర్, ఆదిత్య గన్పులెను దక్షిణాఫ్రికాన్లు సమర్థంగా నిలువరించగా, రెండో బ్యాచ్‌లో వచ్చిన అనికేత్ పోతె సఫారీలను రెండున్నర నిమిషాల పాటు అడ్డుకున్నాడు. రెండో టర్న్‌లో నిఖిల్, ఆదిత్య, గౌతమ్ రాణించడంతో భారత్ 24-20 ఆధిక్యం కనబరిచింది. కీలకమైన మూడో టర్న్‌లో రామ్‌జీ కశ్యప్, పబనీ సబర్, సుయాశ్ రాణించడంతో టీమ్ఇండియా గెలుపు ఖరారైంది. మరోవైపు %ఖ%మహిళల సెమీస్‌లో భారత్ 66-16తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఆదివారం జరిగే ఫైనల్లో నేపాల్‌తో భారత్ తలపడుతుంది.

# అండర్-19 ప్రపంచకప్..

## వెస్టిండీస్‌ను చిత్తు చేసిన భారత అమ్మాయిలు



**కౌలాలంపూర్:** అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత అమ్మాయిలు తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టారు. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన పోరులో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్.. భారత బౌలర్ల ధాటికి 13.2 ఓవర్లలోనే 44 పరుగులకే కుప్పకూలింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి సునాయసంగా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (4) నిరాశపర్చగా.. కమిలిని (16లి), సానికా చాల్కే (18లి) పరుగులు చేశారు. విండీస్ బ్యాటర్లలో అసబి క్యాలెండర్ (12), కెనికా కాసర్ (15) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. టీమ్ఇండియా బౌలర్లలో పరుణికా సిసోదియా 3, జోషిత 2, ఆయుషి శుక్లా 2 వికెట్లు పడగొట్టారు.



# ఆటగాళ్ల ఎంపికలో గంభీర్, రోహిత్ మధ్య అభిప్రాయభేదాలు?

ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం అజిత్ అగార్కర్ సారథ్యంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 6న ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్, ఫిబ్రవరి 19న ఛాంపియన్స్ ట్రోఫీ మొదలవుతుంది. ఈ ట్రోఫీ కోసం రోహిత్ నాయకత్వంలో 15 మంది ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేశారు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు అదనంగా పేసర్ హర్షిత్ రాణాకు చోటునిచ్చారు. శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. అయితే, కొంతమంది ఆటగాళ్ల ఎంపిక విషయంలో కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ మధ్య అభిప్రాయభేదాలు తలెత్తినట్లు వార్తలొస్తున్నాయి. హార్దిక్ పాండ్యకు వైస్ కెప్టెన్ బాధ్యతలు కట్టబెట్టాలని గంభీర్ అనుకున్నాడట. అయితే, శుభ్‌మన్ గిల్‌ను ఉప సారథిగా నియమించాలని రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పట్టుబట్టారట. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో రాణించిన సంజు శాంసన్‌కు జట్టులో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. శాంసన్‌ను తీసుకోవాలని గంభీర్ భావించాడట. కానీ, రోహిత్, అగార్కర్ మద్దతుతో పంత్ ఎంపికయ్యాడని సమాచారం. విజయ్ హజారే టోర్నీ సందర్భంగా కేరళ నిర్వహించిన శిబిరానికి దూరంగా ఉండటం, దేశవాళీ జట్టులో ఆడకపోవడం శాంసన్‌కు ప్రతికూలంగా మారాయి.

### కేసీఏపై శశిథరూర్ విమర్శలు

మంచి ఫామ్‌లో ఉన్నా సంజు శాంసన్ భారత జట్టుకు ఎంపికకాకపోవడంతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కేరళ క్రికెట్ అసోసియేషన్‌పై విమర్శలు గుప్పించారు. 'సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హాజారే ట్రోఫీ టోర్నమెంట్‌ల మధ్య శిక్షణా శిబిరానికి హాజరుకాలేకపోయినందుకు చింతిస్తూ శాంసన్ కేఏసీకి ముందుగానే లేఖ రాశాడు. అయినా జట్టు నుంచి తొలగించారు. ఇప్పుడు అది శాంసన్‌ను జాతీయ జట్టు నుంచి తప్పించడానికి దారితీసింది' అని ట్విటర్ (ఎక్స్)లో పోస్ట్ చేశాడు. మంచి ఫామ్‌లో ఉన్నా క్రికెట్ పాలకుల ఈగో వల్ల శాంసన్ కెరీర్ నాశనమైందని శశిథరూర్ విమర్శించాడు.



# స్కూల్ టీచర్‌పై క్రష్ ఉండేది


## - మీనాక్షి చౌదరి

నటి మీనాక్షి చౌదరి ఈ మధ్య వరుసగా హిట్లు అందుకుంటుంది. గతేడాది విజయ్ గోట్, లక్కీ భాస్కర్‌తో హిట్లు అందుకున్న ఈ భామ తాజాగా సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన ఈ సినిమాను అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా మూవీ సక్సెస్‌కి సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహించింది చిత్రయూనిట్. అయితే ఈ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. తనకు స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని చెప్పుకొచ్చింది. మనందరికీ స్కూల్ లేదా కాలేజీ టైంలో క్రష్ ఉంటుందని.. ఇది అబ్బాయిలకే కాదు అమ్మాయిలకు కూడా ఇలా ఉంటుంది. నాకు కూడా నా స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని అతడంటే చాలా ఇష్టమని మీనాక్షి తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# తెలుగులో త్రిష ఐడెంటిటీ

టొవినో థామస్, త్రిష ప్రధాన పాత్రధారులుగా మలయాళంలో తెరకెక్కిన 'ఐడెంటిటీ' తెలుగులో విడుదల కానుంది. అఖిల్‌పాల్, అనాస్‌ఖాన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మలయాళంలో ఈ నెలలోనే ప్రేక్షకుల ముందుకొచ్చింది. రాజు మల్లియాత్, రాయ్.సి.జె సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రాన్ని చింతపల్లి రామారావు, శ్రీనివాస్ మామిడాల కలిసి ఈ నెల 24న తెలుగులో విడుదల చేస్తున్నారు. "మలుపులతో... ఆద్యంతం ఉత్కంఠని రేకెత్తించే చిత్రమిది. మలయాళంలో మంచి వసూళ్లతో తొలి విజయాన్ని నమోదు చేసింది. తెలుగు ప్రేక్షకుల్నీ తప్పకుండా మెప్పిస్తుంద"ని నిర్మాతలు తెలిపారు. వినయ్‌రాయ్, మందిరాబేడి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: అఖిల్ జార్జ్.



# బులుగు బ్రాలో యంగ్ బ్యూటీ కవ్వింత

క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో కిల్ చేయడంలో త్రిధా చౌదరి తర్వాతే! త్రిషకు మోడ్రన్ వెర్షన్ లా కవ్విస్తుంది ఈ బ్యూటీ. టాలీవుడ్ యంగ్ హీరోల సరసన వరుసగా అవకాశాలు అందుకుంది. 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రంలో నిఖిల్ సరసన నటించిన ఈ భామ ఆ తర్వాత 'మనసుకు నచ్చింది' అనే చిత్రంలోనూ నటించింది. సెవెన్, అనుకున్నదొక్కటి అయినదొక్కటి చిత్రాల్లోను నటించింది. జయాపజయాలకు అతీతంగా నేటితరం హీరోలకు త్రిధా మంచి ఆప్షన్.

ఇటీవల స్పాట్ లైట్ అనే వెబ్ సిరీస్ లో త్రిధా అందాలు ఆరబోసిన తీరు చర్చగా మారింది. వెబ్ సిరీస్ ఆద్యంతం వేడెక్కించే లిప్ లాక్ లతో గుబులు పెంచింది. ఆ తర్వాత బాలీవుడ్ లో 'షంషేరా'లాంటి భారీ చిత్రంలోనూ నటించింది. కానీ ఇవేవీ తన ఫేట్ ని మార్చలేకపోయాయి. వీటన్నిటినీ మించి త్రిధా పట్టుదల ఆశ్చర్యపరుస్తోంది. సోషల్ మీడియాల్లో ఈ భామ జరంత స్పీడ్ కనబరుస్తోంది. ఇన్ స్టాలో నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో తన ఫాలోవర్స్ ని యంగేజ్ చేస్తోంది. తాజాగా త్రిధా షేర్ చేసిన కొత్త ఫోటోగ్రాఫ్ గుండెల్లో గుబులు పెంచుతోంది. ఈ ఫోటోగ్రాఫ్ లో త్రిధా బ్లూ అండ్ బ్లూ లుక్ లో కనిపించింది. శరీరాన్ని అతుక్కుపోయే బ్లూ టాప్ ని ధరించి, టైట్ ట్రాక్ లో హీట్ పెంచింది త్రిధా. త్రిధా ఫోటోషూట్ ఇప్పుడు యూత్‌లో హాట్ టాపిక్ గా మారింది. క్యూట్ బ్యూటీ సో హాలి అంటూ ఫ్యాన్స్ ఘాటైన కామెంట్లు చేస్తున్నారు. త్రిధా అందచందాలకు ముగ్ధులవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ని వాట్సాపుల్లోను జోరుగా వైరల్ చేస్తున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986